# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇచ్చోడ, అక్టోబర్ 13 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఏడో జోన్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్ పోటీలను ఐటీడీఏ పీవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ఎస్పీ ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్టీ గురుకులం నటరాజ్, ఏఈ భీంరావ్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావ్, రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, మారుతి శ్యామల, అశ్విని, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- కిడ్నీలు చెడిపోయి యువకుడి వేదన..
- కిడ్నీ మార్పిడికి రూ.20 లక్షలు అవసరం



చికిత్స పొందుతున్న రవి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 13 : కటిక పేదరికంలో ఉన్న అతని కిడ్నీలు చెడిపోగా.. తల్లి తన కిడ్నీ కొడుకుకు ఇచ్చి బతుకు కొడుకా అని దీవించింది. అయితే విధి ఆ ప్రయత్నాన్ని కూడా అడ్డుకున్నట్లైంది. ఇప్పుడు రెండు కిడ్నీలు చెడిపోయి.. మరణశయ్యపై ఉన్న అతను మానవతావాదుల చేయూత కోసం ఎదురు చూస్తున్నాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారి గ్రామానికి చెందిన నర్మదా – వామన్ దంపతుల కుమారుడు గెడం రవి(32) డిగ్రీ, డీఎడ్ పూర్తి చేశాడు. దంపతులు కూలీ పని చేస్తుంటారు. రవి ఉద్యోగ ప్రయత్నం చేసే క్రమంలో అనారోగ్యబారిన పడగా వైద్య పరీక్షలు చేయించుకుంటే కిడ్నీలు చెడిపోయాయని తేలింది. అప్పుడు కిడ్నీ మార్పిడి చేసేందుకు చాలా ఖర్చు అవుతుందని తెలియడంతో తన తల్లి నర్మదా ముందుకు వచ్చి కిడ్నీ కొడుకుకు దానం చేసింది. కొన్నాళ్లు ఆరోగ్యంగానే ఉన్న రవి ఆ తర్వాత క్రమంగా అనారోగ్యం బారిన పడ్డాడు. మళ్లీ పరీక్షలు చేయించుకుంటే కిడ్నీలు పని చేయడం లేదని డాక్టర్లు చెప్పారు. ఇప్పుడు వయోభారంతో ఉన్న తండ్రి కిడ్నీ కూడా దానం చేసే వీలు కాకుండా ఉన్నది. ప్రస్తుతం డయాలసిస్‌తో దినదిన గండంగా బతుకుతున్న రవికి కిడ్నీ అమర్చడం అత్యవసరమైతే అందు కోసం కనీసం రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే దాదాపుగా రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇప్పుడు మళ్లీ వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమతలో లేదు. మానవతావాదులు తమ కుమారుని ప్రాణం నిలబెట్టడానికి చేయూత నివ్వాలని తల్లిదండ్రులు మొర పెట్టుకుంటున్నారు. సహాయం చేసే దాతలు 8247325942 నంబర్‌కు ఫోన్ పే/జీపే చేయాలని కోరుతున్నారు.

# పూర్తయిన కానిస్టేబుల్ వెరిఫికేషన్ ప్రక్రియ



సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న పోలీస్ అధికారులు

ఎదులాపురం, అక్టోబర్ 13 : ఆదిలాబాద్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న కానిస్టేబుల్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం 97 మంది టీఎస్‌ఎస్పీ అభ్యర్థులు రావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు. 15 మంది ఫైర్ అభ్యర్థులు రావాల్సి ఉండగా ఒక అభ్యర్థి గైర్హాజరయ్యారు. ముగ్గురు జైలు వార్డెన్, ఇద్దరు ఐటీ అండ్ కమ్యూనికేషన్ అభ్యర్థులు, ఏడుగురు ఎక్సైజ్ అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా ఒక అభ్యర్థి గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ప్రక్రియలో భాగంగా అనంతరం మెడికల్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో కార్యాలయ అధికారులు సంజీవ్‌కుమార్, పోతరాజు, ఆశన్న, ప్రసాద్, దయానంద్, పద్మ, సునీత, ఆర్ఐ సీఐ స్వామి, కార్తీక్ పాల్గొన్నారు.

# మద్యం రవాణా కేసులో కారు స్వాధీనం



ఎదులాపురం: పిప్పర్‌వాడ వద్ద మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

ఎదులాపురం, అక్టోబర్ 13 : ఎన్నికల నియమాలు సందర్భంగా ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అనుమతిలేకుండా కారులో దేశీదారు 3 బాటిళ్లు తీసుకువస్తుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమంగా మద్యం రవాణా చేసిన నిజామాబాద్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన బద్దం రాజశేఖర్, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పట్టణంలోని వడ్డెరకాలనీలో తనిఖీలు చేశారు. మంజుల ఆశ దేశీదారు విక్రయిస్తుండగా ఆమెను అరెస్టు చేసి 105 (90ఎంఎల్ బాటిళ్ల)ను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో చెక్‌పోస్ట్ సీఐ అశోక్, ఎస్ఐలు సంధ్యారాణి, సంజీవ్ కుమార్, సిబ్బంది వెంకటగిరి, సంధ్య తదితరులు ఉన్నారు.



మంజుల ఆశను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

# సమాచారాన్ని మీడియా సెంటర్‌కు అందించాలి

- ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్



ఎంసీఎంసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, అక్టోబర్ 13 : ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించడం జరుగుతుందన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం జరుగుతుందన్నారు. కమిటీ ద్వారా ప్రకటనలు, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం లాంటి ప్రక్రియను పరిశీలిస్తూ, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కిస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలు కూడా పరిశీలిస్తామన్నారు. ఎంసీఎంసీ ద్వారా సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియామవాళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్వో ఈ విష్ణువర్ధన్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఈడీఎం రవి, సోషల్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చిన చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఎదులాపురం, అక్టోబర్ 13 : ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ,కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంసీఎంసీ కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన చెల్లింపు వార్తలను ఎంసీఎంసీ కమిటీ సభ్యులు పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలు, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రసారం చేయడం వంటి ప్రక్రియను, అలాగే సోషల్ మీడియాలో ప్రతికూల, అనుకూల ప్రకటనలు కూడా పరిశీలించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించి ఎంసీఎంసీ ద్వారా సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, డీపీఆర్వో ఈ విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా తనిఖీలు చేపట్టండి

బోథ్, అక్టోబర్ 13: మహారాష్ట్ర సరిహద్దులో వాహనాలను పకడ్బందీగా తనఖీ చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బోథ్ మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ఘన్‌పూర్ చెక్‌పోస్టును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని చెక్‌పోస్టుల వద్ద పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. తనిఖీలను వీడియోలో చిత్రీకరించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమించిన వాటిని సీజ్ చేయాలన్నారు. బోథ్ సీఐ భీమేశ్, ఎస్ఐ రాము, ఉన్నారు.



ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద సూచనలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి